కలం
kalamdaily.com
Follow on: Kalamtelugu
ప్రజల గళం...
శనివారం ● 11-04-2026
పేజీలు: 3



SINGLE TOPIC
కరెంట్ కార్మికులు

## సర్కార్ వర్సెస్ ఆర్టిజన్స్

# చీకటి వెలుగులు



### సర్వీస్ రూల్స్ అమలు కోసం కార్మికుల పట్టు.. రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె

### విరమించకుంటే టెర్మినేషన్ వేటు: ప్రభుత్వం

### అణచివేతే కాంగ్రెస్ ఏడో గ్యారంటీనా?: జేఏసీ

### సమ్మర్‌లో కరెంటు సప్లైలో చిక్కులు తప్పవా?

'రాష్ట్రమంతటా వెలుగులు పంచుతున్నాం.. కానీ మా బతుకుల్లో మాత్రం వెలుగు లేదు'.. ఇదీ విద్యుత్ ఆర్టిజన్ కార్మికుల ఆవేదన.

'ఆర్టిజన్ కార్మికుల డిమాండ్లపై గతేడాది నుంచి ఇండస్ట్రియల్ ట్రిబ్యునల్‌లో విచారణ జరుగుతున్నది.. పరిష్కారం కాకముందే సమ్మెకు దిగడం నిబంధనల ఉల్లంఘనే'.. ఇదీ విద్యుత్ శాఖ వాదన.

..ఎవరి వాదన ఎలా ఉన్నా గతంలోని బీఆర్ఎస్ ప్రభుత్వమైనా, ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వమైనా దాదాపు 20 వేల మందికి పైగా ఆర్టిజన్ కార్మికుల సమస్యలను పరిష్కరించలేకపోయాయి. చివరకు నిరసనలు, ఆందోళనలు, సమ్మె తప్పలేదు.

సమ్మెలపై ఆరు నెలల నిషేధం విధిస్తూ ఫిబ్రవరిలోనే నోటీసులు జారీ అయ్యాయన్నది జెన్‌కో, ట్రాన్స్‌కో వాదన. నోటీసులు ఇచ్చిన తర్వాత స్పందన లేకపోవడంతోనే నిరవధిక సమ్మెకు దిగామన్నది ఆర్టిజన్ కార్మికుల జేఏసీ వివరణ. సమ్మె చేస్తే టెర్మినేషన్ తప్పదని జెన్‌కో, ట్రాన్స్ కో సంస్థలతో పాటు డిస్కమ్‌లు కూడా సర్క్యులర్ జారీ చేశాయి. బేషరతుగా 24 గంటల్లో సమ్మెను విరమించి విధుల్లో చేరాలని స్పష్టం చేశాయి. సమ్మె చేస్తున్న ఆర్టిజన్ కార్మికులపై చర్యలు తీసకోవాలంటూ ఆయా విభాగాల ఉన్నతాధికారులకు సర్క్యులర్ జారీ అయింది.

కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆర్టిజన్ కార్మికులను ఆకాశానికెత్తారు. సర్వీస్ రూల్స్ అమలు చేస్తామని హామీ ఇచ్చారు. కానీ ఆచరణ మాత్రం అందుకు భిన్నం. కాంగ్రెస్ సైతం అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికుల, ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినా అందులో భాగమైన ఆర్టిజన్ కార్మికుల విషయంలో మాత్రం ఆశించిన పురోగతి లేదు. ఫీల్డులో పని చేస్తున్న ఆర్టిజన్ వర్కర్లు సమ్మెలోనే కొనసాగితే వారి ఉద్యోగాల టెర్మినేషన్ సంగతి ఎలా ఉన్నా రోజువారీ విద్యుత్ సరఫరాలో ఎదురయ్యే సమస్యలకు పరిష్కారమెలా అనేది చర్చనీయాంశం.

ఆర్టిజన్ల సేవల ప్రాముఖ్యతను గుర్తించే విద్యుత్ డిపార్టుమెంటులోని ఉద్యోగుల నుంచి సంఘీభావం కరువైంది. 'ఆర్టిజన్ కార్మికులు' అనే వ్యవస్థ ఎప్పుడొచ్చింది? వారి ఉద్యోగాలకు భద్రత ఉన్నదా? దీర్ఘకాలంగా వారు చేస్తున్న డిమాండ్లలో న్యాయమున్నదా? విధి నిర్వహణలో ప్రమాదవశాత్తూ చనిపోతే పరిహారం అందుతున్నదా?.. తదితర అంశాలపై కలం ప్రత్యేక కథనం...

- తెలంగాణ బ్యూరో, కలం





## ఎవరీ ఆర్టిజన్లు?

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో విద్యుత్ శాఖలో వివిధ డిపార్ట్‌మెంట్లలో అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు నియామక విధానం అమల్లోకి వచ్చింది. వేలాది మంది ప్రభుత్వ విభాగాల్లో చేరారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేస్తామని.. ఆ వ్యవస్థలను తీసేస్తామంటూ కేసీఆర్ హామీ ఇచ్చారు. తెలంగాణ ఏర్పడి ముఖ్యమంత్రిగా ఆయన బాధ్యతలు తీసుకున్న తర్వాత ఆ డిమాండ్ నెరవేరలేదు. విద్యుత్ శాఖలోని అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులరైజ్ చేస్తామంటూ 2016లో కేసీఆర్ ప్రకటించారు. వాళ్లను విద్యుత్ సంస్థల్లో (జెన్‌కో, ట్రాన్స్ కో, డిస్కమ్‌లలో) విలీనం చేసినప్పటికీ, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు ఇవ్వలేదు. ఆర్టిజన్స్ అనే కొత్త వ్యవస్థను సృష్టించారు. విద్యుత్ శాఖలోని అవుట్ సోర్సింగ్ కార్మికులందరూ కలిపి 20 వేల మందికి పైగానే ఆర్టిజన్లుగా గుర్తిస్తూ 2017లో ఉత్తర్వులు వెలువడ్డాయి. టీఎస్ ట్రాన్స్‌కో, జెన్‌కో, ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ కింద పని చేస్తున్న వీళ్లందరికీ పే స్కేల్ వర్తింపజేశారు.



## సమ్మె ఆగదు..

ఆర్టిజన్ వర్కర్లను విద్యుత్ శాఖ అధికారులు భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. మేం బెదిరింపులకు భయపడం. మా డిమాండ్లను నెరవేర్చే వరకూ సమ్మె కొనసాగిస్తాం. థర్మల్ విద్యుత్ ప్లాంట్లలో సమ్మె కంటిన్యూ అవుతున్నది. అధికారుల ప్రలోభాలకు లొంగే ప్రసక్తే లేదు.

**- సతీశ్ రెడ్డి, చైర్మన్,**
**తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయ్స్ జేఏసీ**

## ఆర్టిజన్లు చేసే పనేంటి? వాళ్ల జీతమెంత?

ఆర్టిజన్లకు ఉండే విద్యార్హతలను బట్టి వారిని అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం నాలుగు గ్రేడ్లుగా విభజించింది. డిప్లొమా/బీటెక్/ఏదైనా డిగ్రీ చదివినవారు గ్రేడ్ 1. ఐటీఐ చదివినవారు గ్రేడ్ 2. టెన్త్/ఇంటర్ చదివినవారు గ్రేడ్ 3. పదో తరగతి లోపు చదివిన వారంతా గ్రేడ్ 4 ఆర్టిజన్లు. ఈ కేటగిరీలను బట్టే జీతాలను నిర్ణయించింది.

- గ్రేడ్ 1 ఆర్టిజన్స్ ఆఫీసుల్లో అడ్మినిస్ట్రేషన్ పనుల్లో ఉంటారు. వీరి జీతం దాదాపు రూ.35 వేలు.
- గ్రేడ్ 2, గ్రేడ్ 3, గ్రేడ్ 4 ఆర్టిజన్స్‌కు ఒకే రకమైన విధులు. సబ్ స్టేషన్ల మెయింటెనెన్స్, కరెంట్ సప్లై, మీటర్ రీడింగ్, బిల్ కలెక్షన్ తదితర పనులు. ఫీల్డ్‌లో జూనియర్ లైన్‌మెన్‌తో సమానమైన పనులు.
- గ్రేడ్-2 ఆర్టిజన్లకు దాదాపు రూ.29 వేలు, గ్రేడ్-3 ఆర్టిజన్లకు దాదాపు రూ.24,500, గ్రేడ్-4 ఆర్టిజన్లకు దాదాపు రూ.10 వేలు.





## ఎందుకీ సమ్మె?

ఏళ్లు గడుస్తున్నా సమస్యలకు పరిష్కారం లేదని, ప్రభుత్వాలు పట్టించుకోలేదని, నోటీసులిచ్చినా నిర్లక్ష్యమేనని, విధిలేని పరిస్థితుల్లో దశలవారీ నిరసనలు, ఆందోళనలు చేసి చివరకు నిరవధిక సమ్మెకు దిగాల్సి వచ్చిందని తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ కార్మికుల జేఏసీ స్పష్టత ఇచ్చింది. 'ఆర్టిజన్' పేరుతో ప్రత్యేక సర్వీస్ రూల్స్ పెట్టి, వెట్టి చాకిరీ చేయిస్తున్నారని, విద్యుత్ సంస్థలు ఇప్పటికీ తాత్కాలిక ఉద్యోగులుగానే పరిగణిస్తున్నాయని పేర్కొన్నది. "ప్రాణాలను పణంగా పెట్టి పని చేస్తున్నా ఎలాంటి రిస్క్ బెనిఫిట్స్ లేవు. కరెంట్ స్తంభాలపై ప్రాణాలు విడిచినా, కిందపడి అంగవైకల్యమైనా ఆర్థిక సాయం అందట్లేదు. వినతిపత్రాలు, విజ్ఞప్తులెన్ని చేసినా ఫలితం లేదు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, సమాన వేతనాలు, సౌకర్యాలు కల్పించాలన్నదే మా డిమాండ్" అని జేఏసీ పేర్కొన్నది. నిబంధనల ప్రకారం.. ''నోటీసులు ఇచ్చాం.. నిరసనలు తెలిపాం.. ధర్నాలు చేశాం.. చివరకు సమ్మె తప్పలేదు'' అని జేఏసీ నేత ఒకరు పేర్కొన్నారు.




## సంస్థను నమ్ముకుంటే.. మాకు మిగిలిందేంటి?

విద్యుత్ శాఖను నమ్ముకుని 20 ఏండ్లుగా పని చేస్తుంటే.. మాకు మిగిలిందేంటి? ఏండ్లుగా పోరాడుతున్నా మా డిమాండ్లను ప్రభుత్వాలు నెరవేర్చడం లేదు. గత ప్రభుత్వం మాకు తీరని అన్యాయం చేసింది. ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వమైనా న్యాయం చేయాలి.

**- రాజేందర్ నాయక్,**
**హబ్సిగూడ డివిజన్ చైర్మన్, టీవీఏఈ జేఏసీ**




హైదరాబాద్‌లోని అజామాబాద్ డివిజన్ ఆఫీసు ఎదుట విద్యుత్ ఆర్టిజన్ల నిరసన


# మా గోస వినుర్రి సర్...

- తెలంగాణ విద్యుత్ శాఖలో ఆర్టిజన్లుగా పనిచేస్తున్న మా బతుకు గోసను జర వినుర్రి సర్.
- ఉద్యమాలతో పోరాడి సాధించుకున్న మన తెలంగాణ రాష్ట్రంలో.. మాలాంటి కిందిస్థాయి కార్మికులు పడుతున్న కష్టాలను పెద్ద మనసుతో అర్థం చేసుకోర్రి సర్.
- తెలంగాణ రాగానే మమ్మల్ని రెగ్యులర్ చేస్తామని చెబితే నమ్మినం సర్. కానీ రూల్స్ అడ్డుపడుతున్నయని మమ్మల్ని ఆర్టిజన్లుగా మార్చిండ్రు సర్.
- ప్రభుత్వాలేమో మమ్మల్ని పర్మనెంట్ చేసినమని చెప్తుంటే.. మేమిప్పటికీ తాత్కాలిక ఉద్యోగులమేనని విద్యుత్ సంస్థలు అంటున్నయి సర్.
- ఈ గోసను మేమెవరికి చెప్పకోవాలి సర్.
- ప్రాణాలకు తెగించి ఇరవై నాలుగ్గంటలు విధులు నిర్వహిస్తున్న మాపై ఎందుకు సర్ ఇంత చిన్నచూపు.
- తోటి కార్మికులు కరెంట్ స్తంభాలపై నుంచి కిందపడి ప్రాణాలు కోల్పోతుంటే, కొన్నిరోజుల వరకు మా గుండెలు ఎట్లా కొట్టుకుంటున్నయో తెలుసా సర్.
- పొద్దున ఆఫీసుకు పోతే, సాయంత్రం ఇంటికి క్షేమంగా వస్తామన్న గ్యారెంటీ లేని బతుకులు సర్ మావి.
- అలాంటి మాపై చిన్నచూపు ఎందుకు సర్.
- పెరుగుతున్న ఖర్చులకు మాకొచ్చే జీతాలు సరిపోక అవస్థలు పడుతున్నం సర్.
- 'మీకేంది.. కరెంటోళ్లువయా.. మస్తు జీతాలు వస్తయ్' అని అందరు అంటుంటే మా కష్టాలను ఇంకెవరికి చెప్పకోవాలో అర్థం అయితలేదు సర్.
- మా బతుకుల్లో వెలుగునింపమని ఎవర్ని అడగాలి సర్.
- ఉద్యమాల గడ్డపై పుట్టిన మాకు ఉద్యమం చేసే అవకాశం, హక్కులు లేవా సర్.
- సమ్మె చేస్తామంటే ఉద్యోగాలే ఉండవని బెదిరిస్తున్నరు. ఇదెక్కడి అన్యాయం సర్.
- విద్యుత్ సంస్థల సీఎండీలతో కాకుండా.. ఒక్కసారి మా బతుకుల్లోకి తొంగిచూడుర్రి సర్. మాతో మాట్లాడుర్రి సర్. మా కష్టాన్ని కళ్లారా ఒక్కసారి చూడుర్రి సర్.
- ప్రాణాలకు తెగించి మేము చేస్తున్న పనికి.. మాకొచ్చే జీతాలను ఒక్కసారి పక్కపక్కన పెట్టి చూడుర్రి సర్. మా జీవితాల్లో వెలుగులు నింపుర్రి సర్.

ఇట్లు,
ఆవేదనతో ఆర్టిజన్ కార్మికుడు

**సోషల్‌మీడియాలో వైరల్ అవుతున్న ఓ ఆర్టిజన్ కార్మికుడి పోస్ట్ ఇదీ..**

## జేఏసీ డిమాండ్లు ఏంటి?

నిరవధిక సమ్మెకు దిగిన విద్యుత్ ఆర్టిజన్ కార్మికులు ప్రభుత్వానికి స్పష్టమైన డిమాండ్ల చార్టర్ సమర్పించారు. విద్యుత్ శాఖను చూస్తున్న ఉప ముఖ్యమంత్రితోనూ ఇటీవల ఆర్టిజన్ జేఏసీ ప్రతినిధులు సమావేశమై చర్చించారు. ఆ శాఖ కార్యదర్శిని కలిసి వివరించి చర్చించాలని సూచించారు. కానీ ఆశించిన స్థాయిలో చర్చలు, పరిష్కార మార్గాలపై పురోగతి లేకపోవడంతో నిరసనలు, ధర్నాలు, వంటా-వార్పు, ఆందోళనల స్టేజ్ దాటి నిరవధిక సమ్మె దాకా చేరింది. కొంతమంది ఆర్టిజన్ వర్కర్స్ సమ్మెలో పాల్గొంటే, మరికొందరు విధుల్లో ఉన్నారు. సమ్మెను కంటిన్యూ చేస్తే టెర్మినేషన్ తప్పదని విద్యుత్ సంస్థలు సర్క్యులర్ జారీ చేశాయి. దానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖలోని ఆయా విభాగాల హెచ్‌వోడీలకు ఆదేశాలు జారీ అయ్యాయి.

## ఇవీ డిమాండ్లు..

- ఆర్టిజన్ కార్మికులందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి.
- ఉమ్మడి ఏపీలోని స్టేట్ ఎలక్ట్రిసిటీ బోర్డు సర్వీస్ రూల్స్ వర్తింపజేయాలి.
- ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో హోదా, ప్రమోషన్లు, లీవ్స్, గ్రాట్యుటీ, పెన్షన్, ఇతర సదుపాయాలు ఉండాలి.
- విద్యార్హతల ఆధారంగా పోస్టుల కన్వర్షన్ చేయాలి. ఐటీఐ చదివిన వాళ్లను జూనియర్ లైన్‌మెన్ (జేఎల్‌ఎం)గా గుర్తించాలి. బీటెక్/డిప్లొమా/ ఏదైనా డిగ్రీ చదివిన వాళ్లను సబ్ ఇంజనీర్లుగా/ ఎల్‌డీసీ/యూడీసీ/కంప్యూటర్ ఆపరేటర్లుగా గుర్తించాలి.
- 2026 పీఆర్సీని అమలు చేయాలి.
- 2016 డిసెంబర్ 4 కటాఫ్ తేదీగా ఆర్టిజన్స్‌ను గుర్తించినా అంతకుముందు నుంచీ పని చేస్తున్న కొందరిని గుర్తించలేదు. ఔట్‌సోర్సింగ్ (అన్‌మ్యాన్డ్ వర్కర్లు) వర్కర్లందరినీ ఆర్టిజన్స్‌గా గుర్తించాలి.
- విద్యుత్ శాఖకు సంబంధించిన స్టోర్లలో పని చేసే పీస్ రేట్ (రోజువారీ కూలీ, హమాలీ) కార్మికులకు జీవో నెంబర్ 11 ప్రకారం కనీస వేతనం ఇవ్వాలి.



## ఇంకా ఎన్నేండ్లు పోరాడాలి?

నాకు గ్రేడ్ 4 ఆర్టిజన్ ఇచ్చారు. స్వీపర్‌గా పని చేస్తున్నాను. మా పోస్టులను కన్వర్షన్ చేయాలి. మా డిమాండ్ల కోసం ఎన్నో ఏండ్లుగా పోరాడుతున్నాం.. ఇంకా ఎన్నేండ్లు పోరాడాలి?

**- సునీత,**
**ఆర్టిజన్ కార్మికురాలు**



## ఒకే సంస్థలో రెండు రకాల రూల్స్ ఏంటి?

ఒకే సంస్థలో రెండు రకాల రూల్స్ అమలు చేయడం ఏంటి? ఎక్కడైనా ఇలా ఉందా? ప్రభుత్వం, విద్యుత్ సంస్థల యాజమాన్యాలు కలిసి మమ్మల్ని మోసం చేశాయి. ఇప్పటికైనా మాకు న్యాయం చేయాలి. ఏపీ ఎస్‌ఈబీ రూల్స్ వర్తింపజేయాలి.

**- సైదులు,**
**అజామాబాద్ డివిజన్ ప్రెసిడెంట్, టీవీఏఈ జేఏసీ**

# చనిపోయినా పట్టించుకోవట్లే..

డ్యూటీ చేస్తూ కరెంట్ షాక్‌తో చనిపోయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నది ఆర్టిజన్ కార్మికుల ఆవేదన. బాధిత కుటుంబానికి ఎలాంటి ఆర్థిక సాయం అందడం లేదని, కేవలం దహన సంస్కారాల ఖర్చుల కింద రూ.25 వేలు అందుతున్నాయని ఆర్టిజన్ వర్కర్లు పేర్కొన్నారు. చనిపోయిన కార్మికుల కుటుంబంలో కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇస్తున్నా విద్యార్హతలకు తగిన జాబ్ ఇవ్వడం లేదన్నారు. కనీస వేతనముండే ఉద్యోగాన్ని ఇచ్చి విద్యుత్ శాఖ చేతులు దులుపుకుంటున్నదని ఆరోపించారు. ''న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరించాలని కోరితే పెడచెవిన పెట్టింది. మరో గత్యంతరం లేని పరిస్థితుల్లో సమ్మెకు దిగితే.. టెర్మినేషన్ అస్త్రాన్ని ప్రయోగిస్తున్నది. ఎస్మా నిబంధనలను అమలు చేస్తున్నది. కాంగ్రెస్ చెప్పే ఏడో గ్యారంటీ అర్థం ఇదేనా?'' అని జేఏసీ లీడర్ ఒకరు వ్యాఖ్యానించారు.



హైదరాబాద్‌లోని హబ్సిగూడ డివిజన్ కార్యాలయం ఎదుట ఆర్టిజన్ల నిరసన